

భయం వీడితే జయమే.. 8లో▸

ఇంటర్ పరీక్షలు ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు ఒత్తిడి వీడి చదివితే అత్యుత్తమ ఫలితాలు సాధించే అవకాశముంటుందని పలువురు సూచిస్తున్నారు.

జెడ్పీ స్థాయీ సమావేశాలు వాయిదా

కైలాస్‌నగర్: ఈనెల 26న నిర్వహించాల్సిన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు వాయిదా వేస్తున్నట్లు సీఈవో రత్నమాల ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆయా శాఖల ఉద్యోగులు బదిలీల్లో నిమగ్నమై ఉన్నందున చైర్మన్ జనార్దన్ రాథోడ్ సమావేశాల వాయిదాకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సమావేశాల నిర్వహణ తదుపరి తేదీని త్వరలోనే ప్రకటిస్తామని, సభ్యులు, అధికారులు విషయాన్ని గమనించాలని ఆమె కోరారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

అదనపు ఎస్పీగా బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న సురేందర్‌రావు

ఆదిలాబాద్‌టౌన్: అదనపు ఎస్పీగా బి.సురేందర్‌రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో కొద్ది రోజులుగా ఈ పోస్టు ఖాళీగా ఉంది. ఈయన అదనపు ఎస్పీ ఆపరేషన్స్, అదనపు ఎస్పీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నుంచి జిల్లాకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అదనపు ఎస్పీని వర్టికల్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యాలయ ఏవో భక్తప్రహ్లాద, డీసీఆర్బీ, ఎస్‌బీ, ఫింగర్‌ప్రింట్ సిబ్బంది సైతం పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

టెక్నికల్ కోర్సు పరీక్షలు షురూ



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కొనసాగాయి. జిల్లా కేంద్రంలోని గెజిటెడ్ నం.1 ప్రభుత్వ పాఠశాల, బాలక్ మందిర్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. గెజిటెడ్ నం.1 పాఠశాలలో నిర్వహించిన లోయర్, హయ్యర్ డ్రాయింగ్ పరీక్షకు 198 మంది హాజరయ్యారు. బాలక్‌మందిర్ సెంటర్‌లో 190 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇదిలా ఉండగా విద్యాశాఖ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ వేణుగోపాల్ ఆయా కేంద్రాలను పరిశీలించారు.

దరఖాస్తుల స్వీకరణ

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ ఆరోగ్యమిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఆధ్వర్యంలో భర్తీ చేయనున్న మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారం, ఇతర వివరాలను http:// adilabad. telangana. gov. in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల వారు ఈ నెల 26 నుంచి 29వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

40వ రోజుకు 'రైల్వేలైన్ సాధన' దీక్షలు



శిబిరంలో కూర్చున్న సమితి సభ్యులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ – ఆర్మూర్ రైల్వేలైన్ పనులు ప్రారంభించాలనే డిమాండ్‌తో రైల్వేలైన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు 40వ రోజుకు చేరాయి. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం ఎదుట చేపట్టిన దీక్షల్లో శనివారం సమితి సభ్యులు కూర్చున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చొరవ చూపి రైల్వేలైన్ పనులు చేపట్టాలని కమిటీ కన్వీనర్ సిర్రా దేవేందర్ డిమాండ్ చేశారు.

ఫేక్‌న్యూస్‌పై అప్రమత్తంగా ఉండాలి

కైలాస్‌నగర్: కలెక్టర్ ప్రొఫైల్‌తో వస్తున్న ఫేక్ న్యూస్‌పై ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు.తప్పుడు ఫోన్‌నంబర్‌తో కలెక్టర్ ఫొటోను ప్రొఫైల్ ఫిక్‌గా ఉపయోగించి కొంతమంది తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి మేసేజ్‌లను అధికారులు, ప్రజలేవరూ నమ్మవద్దని తెలిపారు. అలాంటి మేసేజ్‌లు వస్తే వెంటనే ఉన్నతాధికారులకు, పోలీస్‌లకు సమాచారమందించాలని సూచించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కుమురంభీం భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్‌ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఇందులో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

సాక్షి ఫోకస్

భూ గర్భజలాలు అడుగంటడంతో తాను సాగు చేస్తున్న మక్క పంటకు బోరు ద్వారా పూర్తిస్థాయిలో నీరందించకలేకపోతున్నానని చెబుతున్నాడు ఇచ్చోడ మండలం గేర్జంకు చెందిన రైతు శీలనంద్. ఎండిపోతున్న పంటను కాపాడుకునేందుకు ఇలా బోరుబావిలో అదనంగా పైపులు వేసే చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నాడు. ఇతనొక్కడే కాదు.. జిల్లాలో చాలా మంది రైతులు ఇవే ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.



అడుగంటుతున్న ఆశలు!

- పడిపోతున్న భూగర్భజలాలు
- ప్రస్తుతం జిల్లాలో 7.5 మీటర్ల లోతులో..
- ఆగుతూ పోస్తున్న బోర్లు
- పంటల దిగుబడిపై ప్రభావం
- అన్నదాతల్లో ఆందోళన

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఈ సారి వర్షాకాలంలో జూలై, ఆగస్టు నెలల్లో వానలు కురిసినప్పటికీ ఆ తర్వాత అనుకున్న స్థాయిలో పడకపోవడంతో ప్రస్తుతం నీటి ఇక్కట్లు మొదలయ్యాయి. వానాకాలం పంటలు ఆశించిన స్థాయి దిగుబడి ఇవ్వలేదు. పత్తికి గిట్టుబాటు ధర లభించలేదు. ప్రస్తుతం యాసంగిపైన ఆశలు పెట్టుకున్న రైతులకు కంటిమీద కునుకు కరువవుతోంది. బోరుబావుల ద్వారా సాగు చేసే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా జిల్లాలో గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, నార్నూర్, బోథ్, జైనథ్ తదితర మండలాల్లో బోరుబావులు ఏకధాటిగా నీరు అందించకుండా మధ్య మధ్యలో ఆగుతూ వస్తున్నాయి. దీంతో పంటలకు పూర్తిస్థాయిలో నీరందించలేని పరిస్థితి ఎదురవుతోంది. ఈ ప్రభావం దిగుబడిపై పడుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యాసంగిలో..

జిల్లాలో ఈ యాసంగిలో రైతులు 1లక్ష 55వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అత్యధికంగా శనగ సాగవుతుండగా.. తర్వాత జొన్న, మొక్కజొన్న, గోధుమ, వేరుశనగ సాగవుతోంది. ఈ పంటలు పూత, కాత దశలో ఉన్నప్పుడు నీరు అవసరం ఉంటుంది. వీటికి బోరుబావుల ద్వారా స్ప్రింక్లర్ల సాయంతో నీటిని అందిస్తున్నారు. ఎక్కువ శాతం మంది వ్యవసాయ, బోరుబావుల ద్వారా నీటిని అందిస్తుండగా, జైనథ్ మండలంలోని సాత్నాల ప్రాజెక్టు, మత్తడి వాగు కెనాళ్ల ద్వారా కొంత మంది రైతులు పంటలను సాగు చేస్తున్నారు.

అడుగంటుతున్న భూగర్భజలాలు..

జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. గతేడాది ఇదే సమయంలో ఒక మీటర్ లోతు పైకి ఉండగా, ప్రస్తుతం జిల్లాలో 7.5 మీటర్ల లోతుకు పడిపోయాయి. గత నెలలో 6.9 మీటర్ల లోతులో ఉండగా, ప్రస్తుతం మరో మీటరున్నర లోతుకు చేరాయి. ఏప్రిల్, మే నెలల్లో దాదాపు 9 నుంచి 10 మీటర్ల లోతులో భూగర్భ జలాలు అడుగంటే పరిస్థితి ఉందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. జైనథ్, బోథ్, బజార్‌హత్నూర్, ఇచ్చోడ, గుడిహత్నూర్ తదితర మండలాల్లో భూగర్భజలాలు రోజురోజుకు తగ్గుతూ వస్తున్నాయి. అయితే జిల్లాలో తాంసి, జైనథ్, బోథ్, ఇచ్చోడ మండలాల్లో జొన్న, శనగ, మొక్కజొన్న, గోధుమ పంటలు సాగవుతున్నాయి. ఇచ్చోడ, గుడిహత్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో కూరగాయల సాగు అధికంగా ఉంది. ఉట్నూర్ మండలంలో 300 ఎకరాల్లో వరి సాగవుతోంది. ప్రస్తుతం పంటలపై అంతగా ప్రభావం లేకపోయినప్పటికీ రానున్న రోజుల్లో నీటి ఇబ్బందులు తప్పేటట్టు లేదని అధికారులు పేర్కొంటున్నారు. మార్చి 15 వరకు శనగ, గోధుమ పంటలు కోతకు రానుండగా, మొక్కజొన్న, జొన్న, కందులు ఏప్రిల్, మే మాసాల వరకు కోత వచ్చే అవకాశం ఉంది. ఈ పంటలపై భూగర్భ జలాల ప్రభావం పడనుంది. రైతులు పొదుపుగా బోరుబావుల ద్వారా నీటిని వినియోగించుకుంటే ఇబ్బందులు తలెత్తవని అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో యాసంగి పంటల సాగు వివరాలు (ఎకరాల్లో)

శనగ	67,000
జొన్న	62,000
మొక్కజొన్న	11,000
గోధుమ	4,600
వేరుశనగ	1500
వరి	300

బోరు ఆగుకుంటా పోస్తంది



నేను రెండెకరాల్లో మొక్కజొన్న, ఎకరంలో జొన్న సాగు చేస్తన్న. బోరు నీళ్లు సరిగా రావట్లేదు. ఒక్కసారి మోటర్ ఆన్ చేస్తే గంట నుంచి రెండు గంటల దాకా బోరు పోస్తంది. తర్వాత ఆగిపోతంది. మల్లా రెండు మూడు గంటల తర్వాత నీళ్లు పెట్టాల్సి వస్తంది. ఇప్పుడే ఇట్లుంటే ముందుముందు ఇంకా కష్టంగా మారనుంది.

– ఆత్రం నాగోరావు, రైతు, ఇంద్రవెల్లి

తిప్పలైతంది..



ఈ యాసంగిలో నాలుగెకరాల్లో వేరుశనగ వేసిన. వారంక్రితం దాకా బోరు నుంచి 10 స్ప్రింకర్ల ద్వారా పంటకు నీళ్లు పెట్టిన. ఇప్పుడు 6 స్ప్రింక్లర్ల ద్వారా మాత్రమే నీళ్లు వస్తున్నయ్. చానా తిప్పలైతంది. దిగుబడి తగ్గే అవకాశం కనిపిస్తంది. వానాకాలంలో పంటలు దెబ్బతిని దిగుబడి రాలేదు. ఈ యాసంగిని నమ్ముకుంటే ఇప్పుడు నీళ్ల గోస మొదలైంది.

– రొద్ద రవి, రైతు, వడ్డాడి, తాంసి మండలం

కొలిక్కివచ్చేనా..!

- 'లోక్‌సభ' అభ్యర్థుల ఎంపికపై పార్టీల కసరత్తు
- 29న బీజేపీ తొలి జాబితా
- 'హస్తం' ఎవరికి దక్కేనో..?
- ఆ రెండింటి తర్వాతే బీఆర్‌ఎస్ డిక్లేర్ చేసే అవకాశం



సాక్షి,ఆదిలాబాద్: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ త్వరలోనే విడుదలయ్యే అవకాశం ఉంది. మరోపక్క పార్టీల నుంచి పోటీ చేసే అభ్యర్థుల ఎంపికలో తీవ్ర కసరత్తు నడుస్తోంది. బీజేపీ మొదటి జాబితా ఈనెల 29న విడుదల కానుంది. అందులో ఆదిలాబాద్ అభ్యర్థి పేరు ఉంటుందా.. లేని పక్షంలో మరోవిడతలో ఖరారు అవుతుందా తేలనుంది. కాంగ్రెస్‌లో దరఖాస్తు ప్రక్రియ ముగిసిన తర్వాత అభ్యర్థి ఎంపిక తుది దశకు వచ్చింది. ఆ పార్టీ కూడా అభ్యర్థి ఎవరు అనేది త్వరలోనే వెల్లడించే అవకాశం ఉంది. ఈ రెండు పార్టీల్లో అభ్యర్థుల ప్రక్రియ ముగిసిన తర్వాతే బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎవరనేది తేలుతుందని ఆ పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

బీజేపీ, కాంగ్రెస్ ముందంజ..

కాంగ్రెస్‌పరంగా ఇంద్రవెల్లి నుంచి సీఎం రేవంత్ రెడ్డి పార్లమెంట్ ఎన్నికల శంఖారావం పూరించారు. ఆ పార్టీ శ్రేణులను ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇదిలా ఉంటే ఆ పార్టీ పరంగా దరఖాస్తు చేసుకున్న పలువురు అభ్యర్థులు ప్రస్తుతం పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో విస్తృతంగా తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. బీజేపీ ఇటీవలే విజయసంకల్ప యాత్ర మొదలు పెట్టిన విషయం తెలిసిందే. ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, సీనియర్ నేత ఈటల రాజేందర్ యాత్రలో భాగంగా ఇటీవలే జిల్లాలో పర్యటించారు. ఈ యాత్ర పార్టీలో ఉత్సాహం నింపింది. మూడోసారి ప్రధానమంత్రిగా మోదీని చేయాలనే నినాదాన్ని ఆ పార్టీ శ్రేణులు ముందుకు తీసుకెళ్తున్నాయి. ఇదిలా ఉంటే బీఆర్‌ఎస్ పరంగా ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశం హైదరాబాద్‌లో జరగగా ఆ తర్వాత అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమావేశాలు మొదలు పెట్టారు. బోథ్‌లో పూర్తి కాగా మిగతా నియోజకవర్గాలో నిర్వహించాల్సి ఉంది.

పోటా పోటీ..

బీజేపీలో సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావునే తిరిగి పార్టీ అభ్యర్థిగా ప్రకటిస్తుందా లేని పక్షంలో ఇతరులను ఎవరినైనా బరిలోకి దించుతుందా చూడాల్సిందే. మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, భైంసా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాదవ్ రాజేశ్‌బాబు, సినీనటుడు అభినవ్ సర్దార్, ఆదివాసీ మహిళా నేత శ్రీలేఖ, ఆసిఫాబాద్‌కు చెందిన కోట్నాక విజయ్ టికెట్ ఆశిస్తున్నారు. దీంతో పార్టీ ఎవరివైపు మొగ్గు చూపుతుందనేది ఆసక్తికరం. కాంగ్రెస్‌లో మాజీ ఎమ్మెల్యే రేఖా శ్యాంనాయక్, ఏఐసీసీ సభ్యుడు నరేశ్‌జాదవ్, యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రావణ్‌నాయక్, ఆదిలాబాద్ రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఐటీశాఖ అసిస్టెంట్ కమిషనర్ రాథోడ్ ప్రకాశ్, ఉట్నూర్ అదనపు డీఎంహెచ్‌వో కుడ్మం బాలు, ఐటీడీఏ పీవీటీజీ ఏపీవో ఆత్రం భాస్కర్, ఐటీడీఏ బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ మేస్రం మనోహర్, పరిశ్రమల శాఖ రిటైర్డ్ అధికారి జాదవ్ రాంకిషన్ నాయక్, ఆదిలాబాద్ ఎల్ఐసీ ఉద్యోగి దౌలత్‌రావు, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, ఆదివాసీ సంఘం మహిళా జిల్లా అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, ఉట్నూర్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి రోషన్ టికెట్ కోసం యత్నిస్తున్నారు. పార్టీ ఎవరిని బరిలోకి దించుతుంది అనేది ఆసక్తికరంగా మారింది.

వేచి చూస్తున్న బీఆర్‌ఎస్

బీజేపీ, కాంగ్రెస్‌అభ్యర్థుల ఖరారు తర్వాతే బీఆర్‌ఎస్ అభ్యర్థిని ఖరారు చేయనున్నట్లు ఆ పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ పార్టీ నుంచి ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పేరు మొదటి నుంచి బలంగా వినిపిస్తుంది. మాజీ ఎంపీ గోడం నగేశ్ కూడా టికెట్ ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నిర్ణయం ఎలా ఉంటుంది అనేది వేచిచూడాల్సిందే.

సోయా కొనుగోళ్లు ప్రారంభం



సాయా కొనుగోలును ప్రారంభిస్తున్న మోహన్

ఆదిలాబాద్‌టౌన్: రైతులు పండించిన సోయా పంటను మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా కొనుగోలు చేసేందుకు జిల్లాలోని పలు వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ యార్డులో కొనుగోళ్లను జిల్లా సహకార సంఘం అధికారి మోహన్ శనివారం ప్రారంభించారు. తొలుత కాంటాకు పూజలు చేసి, యార్డుకు తొలి పంటను తీసుకువచ్చిన రైతును సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్దేశిత తేమ శాతం ఉంటే సోయాకు మద్దతు ధర రూ.4,600 చెల్లించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధికారి శ్రీనివాస్, హమాలీ యూనియన్ అధ్యక్షుడు షేక్‌బాబు, ప్రధాన కార్యదర్శి హైమద్, రైతులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే క్రిమినల్ కేసు

- డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: గర్భిణులకు లింగ నిర్ధారణ పరీక్షలు చేసే వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. పట్టణంలోని ప్రైవేట్ ప్రసూతి వైద్యులతో శనివారం తన చాంబర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమన్నారు. పీసీపీఎన్‌డీటీ యాక్టు ప్రకారం నిబంధనలు ఉల్లంఘిస్తే శాఖాపరమైన చర్యలతో పాటు ఆసుపత్రులను సీజ్ చేస్తామన్నారు. అలాగే సిజేరియన్ కాన్పులు తగ్గించి సాధారణ ప్రసవాలు అయ్యేలా వైద్యులు చొరవ చూపాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, వైద్యులు విజయసారథి, రమ, శ్యామల, మమత తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

తలమడుగు: వైద్య సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. పలు రిజిస్టర్లను పరిశీలించారు. సిబ్బంది హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న ఆరోగ్యకేంద్రం భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట వైద్యులు వంశీ, హరీష్, సిబ్బంది తదితరులున్నారు.

కొనసాగుతున్న రిమ్స్ ఉద్యోగుల నిరసన



నినాదాలు చేస్తున్న కార్మికులు

ఆదిలాబాద్‌టౌన్: జీవో నం.60 ప్రకారం వేతనాలు చెల్లించడంతో పాటు తమను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంట్రాక్టర్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ రిమ్స్ కార్మికులు చేపట్టిన నిరసన కొనసాగుతుంది. తెలంగాణ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆస్పత్రి ఎదుట శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి సిర్ర దేవేందర్ మాట్లాడుతూ.. అగ్రిమెంట్ ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రోగులకు సేవలు అందిస్తూనే ప్రతి రోజు గంట పాటు నిరసన చేపడుతున్నామని, సమస్య పరిష్కారం కాకపోతే మార్చి 7 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎండీ ఖాసిమ్, సంగీత, ఇమ్రాన్‌ఖాన్, రాము, రవీందర్, రాథోడ్ రవి, రాజేందర్ సింగ్, స్వామి, వెంకటేశ్, దత్తు, నర్సింగ్, సైఫ్‌ఖాన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల సత్ప్రవర్తన కోసం కృషి

- జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా
- ఆదిలాబాద్ జైలు వద్ద పెట్రోల్‌బంక్ ప్రారంభం



పెట్రోల్‌బంక్‌ను ప్రారంభిస్తున్న జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, పక్కన కలెక్టర్ రాహుల్‌రాజ్ తదితరులు

ఆదిలాబాద్‌టౌన్: ఖైదీల్లో సత్ప్రవర్తన కోసం జైళ్ల శాఖ కృషి చేస్తుందని ఆ శాఖ డీజీ సౌమ్య మిశ్రా అన్నారు. శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జిల్లా జైలు వద్ద నూతనంగా నిర్మించిన పెట్రోల్‌బంక్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఖైదీలు శిక్ష కాలం పూర్తయ్యాక వారు విడుదలై సమాజంలో గర్వంగా జీవించేలా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా పెట్రోల్‌బంక్‌లను నిర్మించి వారికి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 38 బంక్‌లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే వినియోగదారులకు నాణ్యమైన పెట్రోల్ అందించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో తాను మొదట ఆసిఫాబాద్, తర్వాత ఆదిలాబాద్‌లో విధులు నిర్వహించినట్లు గుర్తు చేసుకున్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ.. జిల్లా జైలులో ఖైదీలకు ఉపయోగపడేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. రిమాండ్ ఖైదీల ఆరోగ్యం దృష్ట్యా ప్రత్యేక వైద్యులను నియమించామన్నారు. జైలులో అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజీ మురళీబాబు, వరంగల్ రేంజ్ డీఐజీ సంపత్, జిల్లా జైలు సూపరింటెండెంట్ అశోక్, జైలర్లు ప్రకాశ్‌రెడ్డి, మధు, డిప్యూటీ జైలర్, కృష్ణ, ప్రకాశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీ సోయం

కైలాస్‌నగర్: అటవి జంతువుల దాడిలో పశువులను కోల్పోయిన బాధిత రైతులకు మంజూరైన చెక్కులను ఎంపీ సోయం బాపూరావు అటవీశాఖ అధికారులతో కలిసి శనివారం అందజేశారు. బోథ్ మండలంలోని గుట్టపక్కతండా గ్రామానికి చెందిన గణేశ్‌కు రూ.18 వేలు, చిట్టల్‌బోరి గ్రామానికి చెందిన చౌహాన్ సోమనాథ్‌కు రూ.15 వేల విలువైన చెక్కులను తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అటవి జంతువుల దాడిలో జిల్లాలో మొత్తం 26 కేసులు నమోదు కాగా.. 25 పశువులు మృతి చెందాయన్నారు. రూ. 3,22,000 ఆర్థిక సాయం మంజూరైనట్లుగా ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో బోథ్ ఫారెస్ట్ రేంజ్ అధికారి వినోద్ కుమార్, డిప్యూటీ రేంజ్ అధికారి ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలను ప్రారంభించిన ఎంపీ

బోథ్: మండలంలోని పట్నాపూర్ గ్రామంలో చైతన్య యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను ఎంపీ సోయం బాపూరావ్ శనివారం ప్రారంభించారు. 24 ఏళ్లుగా ఏటా పోటీలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్, మాజీ సర్పంచ్ సుగుణ, ఎంపీటీసీ జుగాదిరావ్, న్యాయవాది శంకర్, జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆదర్శ పాఠశాలను సందర్శించిన ఆడిట్ బృందం

బజార్‌హత్నూర్: హైదరాబాద్‌కు చెందిన సామాజిక, ఆర్థిక అధ్యయన కేంద్రం బృందం శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సమగ్ర శిక్ష సామాజిక పరిశీలన చేపట్టారు. సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ చంద్రశేఖర్, రీసెర్చ్ సూపర్‌వైజర్ రేణుకతో కలిసి పాఠశాలలో అమలవుతున్న సమగ్ర శిక్ష అభియాన్ కార్యక్రమాలను, రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, మౌలిక వసతులు, ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలు, సమగ్ర శిక్ష అభియాన్ అమలు తీరుపై ఆరా తీశారు. జిల్లాలో ఎంపికైన పాఠశాలలను తనిఖీ చేసి సంబంధిత వివరాలను డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత



కలపను పట్టుకున్న అటవీశాఖ అధికారులు

సిరికొండ: మండలంలోని వాయిపేట్ అటవీ నుంచి అక్రమంగా ట్రాక్టర్‌లో కలపను తరలిస్తున్నారనే సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు గస్తీ నిర్వహించారు. శనివారం తెల్లవారు జామున వాయిపేట్ నుంచి కలపను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అటవీ శాఖ అధికారులు వెంబడించగా తప్పించుకున్నారు. అయితే మండల కేంద్రం శివారులో ఆరు టేకు దుంగలను పడేసి వెళ్లిపోయారు. వాటిని స్వాధీనం చేసుకున్న అధికారులు మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు డిప్యూటీ రేంజ్ అధికారి గీరయ్య తెలిపారు. అనంతరం విచారణ చేయగా ట్రాక్టర్ భీంపూర్ గ్రామానికి చెందిన రాముకు చెందినదిగా తేల్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ గస్తీలో ఎఫ్‌బీవో సందీప్, బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చి లారీలు పట్టివేత

ఇచ్చోడ: అక్రమంగా మిర్చి తరలిస్తున్న రెండు లారీలను పట్టుకొని కమర్షియల్ ట్యాక్స్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. శుక్రవారం రాత్రి పెట్రోలింగ్ చేస్తుండగా మిర్చిలోడ్‌తో ఉన్న రెండు లారీలను తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. సరైన పత్రాలు లేకపోవడంతో లారీలను జిల్లా కమర్షియల్ ట్యాక్స్ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఆంధ్ర నుంచి నాగ్‌పూర్‌కు వెళ్తున్న లారీలకు ఎలాంటి ధ్రువ పత్రాలు లేకపోవడంతో వారికి అప్పగించినట్లు తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రిమ్స్ ఆసుపత్రి నుంచి ద్విచక్ర వాహనం చోరీ అయినట్లు టూ టౌన్ ఎస్సై జీవీ రమణ రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని భీంసరి గ్రామానికి చెందిన విలాస్ తల్లి అనారోగ్యంతో బాధపడుతూ రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెను చూడడానికి విలాస్ ఈ నెల 21న ఆసుపత్రి ఆవరణలో ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి ఆసుపత్రిలోకి వెళ్లాడు. గంట అనంతరం చూసేసరికి బైక్ కనిపించక పోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భయం వీడితే జయమే..

- పరీక్షల వేళ ఒత్తిడిని దరిచేరనివ్వద్దు
- ప్రశాంతతతోనే మంచి ఫలితం
- ఒత్తిడిని జయిస్తేనే విజయమంటున్న నిపుణులు
- మరో మూడురోజుల్లో ఇంటర్ పరీక్షలు ప్రారంభం



విద్యార్థుల సన్నద్ధతను పర్యవేక్షిస్తున్న డీఐఈవో పరశురాం (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: విద్యా సంవత్సరం మొత్తం చదువులు, ప్రత్యేక తరగతులు, రివిజన్, సెమి ఫైనల్ పరీక్షలు, ప్రయోగపరీక్షలు.. అన్ని దాటుకుంటూ తుది పరీక్షల వరకు వచ్చేశారు ఇంటర్ విద్యార్థులు. చివరి దశ పరీక్షలు అనే సరికి మనసులో ఆందోళన ఉంటుంది. తక్కువ మార్కులు వస్తే, ఫెయిల్ అయితే ఎలా అనే ఆందోళనతో ఒత్తిడికి గురవుతుంటారు. పరీక్షలు జీవితంలో భాగం మాత్రమేనని ఎంతో భవిష్యత్ ముందుంటుందని విద్యావేత్తలు మానసిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నేర్చుకున్న పాఠ్యాంశాలను ప్రశాంతంగా చదివితే సరిపోతుందని, ఫలితం ఏ విధంగా వచ్చిన స్వీకరించేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని చెబుతున్నారు. గతేడాది రాష్ట్రస్థాయి మార్కులతో అగ్రస్థానంలో నిలిచిన విద్యార్థులు పలు సూచనలిస్తున్నారు. మరో మూడు రోజుల్లో ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.

ఈ ఐదు రోజులు ఇలా చేయాలి...

- విద్యార్థులు తెల్లవారుజామున 5గంటలకు లేచి రివిజన్ చేయాలి. ఉదయం పూట చదవడంతో పాఠ్యాంశాలు తొందరగా మదిలోకి ఎక్కుతాయి. ఎక్కువ కాలం పాటు జ్ఞాపకం ఉంటాయి.
- రోజువారి సమయం ప్రకారం సబ్జెక్టుల వారీగా సమయాన్ని విభజించుకోవాలి..
- పరీక్షలకు మధ్యలో సెలవులు వచ్చిన వాటికంటే వరుసగా ఉన్న పరీక్షల పాఠ్యాంశాలను ఎక్కువ సమయం పాటు రివిజన్ చేయాలి.
- కఠినమైన అంశాలను రాస్తూ అధ్యయనం చేయాలి. బట్టీ పట్టకుండా సబ్జెక్టును సమగ్రంగా ఆకలింపు చేసుకోవాలి.
- చదివిన అంశాన్ని చూడకుండా కాగితం పై రాస్తూ సాధన చేయాలి..
- పరీక్షలు పూర్తయ్యే వరకు సెల్‌ఫోన్లు టీవీలు వంటి వాటికి దూరంగా ఉండడం మంచిది.

తల్లిదండ్రుల బాధ్యత ఏమిటి..?

తల్లిదండ్రులు ఇంటర్ చదువుతున్న తమ పిల్లల్ని మార్కుల విషయంలో ఒత్తిడికి గురిచేయకుండా ప్రశాంత వాతావరణం ఏర్పాటు చేయాలి. పరీక్షలు పూర్తయ్యే వరకూ ఇతర వ్యాపకాలకు దూరంగా ఉండేలా ఇంట్లో వాతావరణాన్ని సృష్టించాలి. వారిని కోపగించుకోకుండా సరైన సాత్విక ఆహారం అందిస్తూ ఇన్ని రోజులు చదివిన పాఠ్యాంశాలను రివిజన్ చేయమని సూచించాలి. పాఠ్యాంశ విషయాలను నిపుణులైన అధ్యాపకుల చేత సందేహ నివృత్తి చేసేలా సదుపాయం కల్పించాలి.

ఉమ్మడి జిల్లాలో ఇంటర్ విద్యార్థులు..

జిల్లా	కాలేజీలు	విద్యార్థులు
నిర్మల్	63	13,345
మంచిర్యాల	66	15,529
ఆదిలాబాద్	77	21,527
కుమురంభీం	48	10,423

ప్రశాంతంగా చదివితే ఫలితం..



ఇంటర్ పరీక్షలు ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు ఒత్తి డికి లోను కాకుండా ప్రశాంత వాతావరణంలో ఉండా లి. పరీక్షలు ప్రారంభమయ్యాక పరీక్షకు సంబంధించిన పాఠ్యాంశాలను మాత్రమే చదవాలి. పూర్తయిన పరీక్షల గురించి ఎక్కువగా ఆలోచించకూడదు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు సాధిస్తారు. – జాదవ్ పరశురాం, జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి, నిర్మల్

శ్రమకు తగ్గ విశ్రాంతి అవసరం...



పరీక్షల కాలంలో విద్యార్థులలో సహజంగానే అంతర్గతంగా ఒత్తిడి ఉంటుంది. చదవడానికి శ్రమిస్తున్న వి ద్యార్థులు మధ్యమధ్యలో విశ్రాంతి తీసుకోవాలి. ని రంతరం విరామం లేకుండా చదవడం కంటే మ ధ్యలో 15 నుండి 20 నిమిషాల పాటు మనసుకు విశ్రాంతినివ్వాలి. అలా ఉంటే మైండ్ కూడా రిఫ్రె ష్ అవుతుంది. దీంతో ఇంకా ఏకాగ్రతతో అదనంగా చదవడానికి అవకాశం ఉంటుంది. సమతుల ఆహారం, సరైన మోతాదులో నీరు తీసుకోవాలి. – డాక్టర్ అల్లాడి సురేష్, ఎండీ, సైకియాట్రిస్ట్, మానసిక వైద్య నిపుణులు, నిర్మల్

ఒత్తిడికి గురికావొద్దు...



పరీక్షలు రాసే విద్యార్థులకు ఒత్తిడితో కూడిన ఆందోళనకు గురవుతారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి ప్రయత్నించాలి. పరీక్షలకు ముందు రోజు ఆహ్లాదకరమైన వాతావరణంలో గడపాలి. కొత్త పాఠ్యాంశాల జోలికి వెళ్లకుండా రిపీట్ చేయాల్సిన అంశాలనే చూసుకోవాలి. నేను నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదివి 2023 ఇంటర్ ఫలితాల్లో 987 మార్కులతో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించాను. – భవానీ హాసిని, గతేడాది రాష్ట్రస్థాయి 3వ ర్యాంకర్, నిర్మల్

సానుకూలవైఖరే ఆయుధం...



నేను గత ఏడాది బైపీసీలో 987 మార్కులు సాధించాను. ఖచ్చితంగా మంచి ఫలితాన్ని సాధిస్తాననే వైఖరితో పరీక్షలను ఎదుర్కోవాలి. పరీక్ష రోజు ఆందోళన చెందకుండా పరీక్ష కేంద్రానికి వెళ్లాలి. వచ్చిన ప్రశ్నలకు సమాధానాలను రాస్తూ వెళ్లాలి. రాని సమాధానాల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. తరగతి గదిలో విన్న అంశాలను ప్రశాంతచిత్తంతో ఆలోచిస్తే అవే గుర్తుకు వస్తాయి. – జి.వినాయక్, నిర్మల్

ఆత్మవిశ్వాసంతో పరీక్షల్ని ఎదుర్కోవాలి..



నేను నిర్మల్‌లోని దీక్ష జూనియర్ కాలేజీలో ఇంటర్ పూర్తి చేశాను. గతేడాది రాసిన పరీక్షల్లో 986 మార్కులతో రాష్ట్రస్థాయి స్థానం లభించింది. అన్ని పరీక్షలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలి. పరీక్షల రోజుల్లో ఎంత చదివాం అన్న దానికంటే ప్రశ్న పత్రంలోని సమాధానాలను ఎంత విజయవంతంగా ప్రజెంట్ చేశామన్నదాని పైనే మన మార్కులు ఆధారపడి ఉంటాయి. ప్రశ్నపత్రంలోని సమాధానాలను నిర్ణీత సమయంలో రాస్తే సరిపోతుంది. – డీ. శ్రీజ, ఎంపీసీలో 986మార్కులు..

ఘనంగా ముజ్గి మల్లన్న జాతర

ముజ్గిగి మల్లన్న ఆలయ ఆవరణలో బోనాలతో భక్తులు





ముజ్గిగి మల్లన్న ఉత్సవ మూర్తులు



నిర్మల్‌రూరల్: మండలంలోని ముజ్గి మల్లన్న జాతర శనివారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామంతో పాటు నిర్మల్, చిట్యాల, సోన్, కర్తాల్‌తదితర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. శనివారం సాయంత్రం పెద్ద సంఖ్యలో భక్తులు సల్లకుండలతో ఆలయానికి నడిచి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్‌రెడ్డి, నాయకులు అయ్యగారు భూమయ్య దర్శించుకున్నారు. వీడీసీ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.



శివసత్తుల పూనకాలతో..

మల్లన్న దేవుని ఆలయాల్లో భక్తుల పూజలు

- ఎల్విలో మల్లయోదులకు కుస్తీ పోటీలు
- మొక్కలు తీర్చుకున్న భక్తులు



కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు

తానూరు: మండల కేంద్రంతో పాటు ఎల్వి గ్రామాల్లోని మల్లన్న దేవుడి ఆలయాల్లో శనివారం భక్తులు పూజలు నిర్వహించారు. తానూరులోని మల్లన్న దేవుని ఆలయంలో మల్లన్న కల్యాణమహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎల్వి గ్రామంలో భక్తులు ఉదయం పూజలు నిర్వహించి మల్లన్న పల్లకిని గ్రామంలోని ఆయా విధుల గుండా ఊరేగించారు.

మల్లయోధులకు కుస్తీ పోటీలు...

మల్లన్న దేవున్ని ఉత్సవాల సందర్భంగా ఎల్వి గ్రామంలో మల్లయోధులకు గ్రామ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలను నిర్వహించారు. స్థానికులతో పాటు మహారాష్ట్ర నుంచి సైతం పోటీల్లో పాల్గొన్నారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మల్లయోధులకు బహుమతులు ప్రదానం చేశారు.

అప్పల బాధతో ఆత్మహత్య



రాము మృతదేహం

ముధోల్: మండల కేంద్రంలోని కాల్వగల్లీ వాసి హంగిరిరోళ్ల రాములు(38) అప్పుల బాధతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. వివరాల ప్రకారం... రాములు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తాడు. ఇటీవల వేసిన పంటలు ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవడంతో చేసిన అప్పులు తీర్చే పరిస్థితి లేక జీవితంపై విరక్తి చెందాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో నుంచి బయటకి వెళ్లి వ్యవసాయ చేను వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాములు భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపాడు.


కుటుంబ కలహాలతో...



దేవన్న(ఫైల్)

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామానికి చెందిన దేవన్న(55) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... దేవన్న ఐదు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కుటుంబ కలహాలతో ఇంటికి తి రిగి రాలేదు. శనివారం గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకు ని ఆత్మహత్య చేసుకున్నాడు. పంట పొలాలకు వెళ్లిన వారు గుర్తించి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం ఇచ్చా రు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహా న్ని పోస్టుమార్టం కోసం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



అభిలాశ్(ఫైల్)

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన అభిలాశ్ (36) మృతిచెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం రాత్రి భైంసా పట్టణానికి చెందిన అభిలాశ్, ఆనంద్‌లు నిర్మల్ వైపు నుంచి ద్విచక్రవాహనంపై భైంసాకు వస్తున్నారు. వానల్‌పాడ్ గ్రామ సమీపంలో వంతెనకు ఢీ కొట్టడంతో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక సేవలు అందించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అభిలాశ్ మృతిచెందాడు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించాడు.

దుబాయిలో రోడ్డు ప్రమాదం

- మలక్‌చించోలి యువకుడి మృతి

సారంగాపూర్: మండలంలోని మలక్‌చించోలి గ్రామానికి చెందిన అప్పాల నవీన్ (19) దుబాయిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడురోజుల క్రితం మృతిచెందాడు. బంధువుల వివరాల ప్రకారం.. నవీన్ ఏడునెలల క్రితం దుబాయికి వెళ్లి అక్కడ ఓ ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో విధులు ముగించుకుని బస్సులో నివాసానికి బయటు దేరగా ఆ బస్సు ప్రమాదానికి గురైంది. దీంతో నవీన్ అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారుడి మృతివార్త విన్న తల్లిదండ్రులు ఎర్రవ్వ–రాజన్నలు విలపించే తీరు గ్రామస్తులను కలిచివేసింది. ఉపాధి నిమిత్తం దుబాయికి వెళ్లి తమను ఆదుకుంటావనుకున్న ఒక్కగానొక్క కొడుకు మృత్యువాత పడడంతో ఆ కుటుంబం వీధిన పడినట్లయింది.



నవీన్(ఫైల్)


స్వగ్రామానికి గల్ఫ్ మృతదేహం



స్వగ్రామానికి చేరుకున్న మృతదేహం

సారంగాపూర్: మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన కొందూరి అరవింద్ (20) మృతదేహం దుబాయి నుంచి శనివారం బోరిగాం గ్రామానికి ప్రత్యేక అంబులెన్స్‌లో చేరుకుంది. ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పరికిండ్ల స్వదేశ్ వివరాల ప్రకారం... అరవింద్ ఏడాది క్రితమే దుబాయికి ఉపాధి నిమిత్తం వెళ్లాడు. దుబాయిలోని ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో కొద్దిరోజుల క్రితం అనారోగ్యానికి గురై కోమాలోకి వెళ్లాడు. అక్కడి వైద్యులు చికిత్స అందిస్తున్న క్రమంలో బ్రెయిన్ డెడ్ కావడంతో మృతి చెందాడు. జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి విషయాన్ని స్వదేశ్ పరికిండ్లకు సమాచారం ఇచ్చాడు. దీంతో దుబాయిలో జనగామ వాసి గల్ఫ్ జేఏసీ కోఆర్డినేటర్ యాతం స్వామి చొరవ తీసుకుని మృతదేహాన్ని రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్టుకు, అక్కడి నుంచి ప్రత్యేక అంబులెన్స్‌లో బోరిగాం గ్రామానికి తరలించారు.

బైక్‌ను ఢీకొన్న కారు



ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

నేరడిగొండ: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద శనివారం చోటుచేసుకుంది. కిష్టాపూర్ గ్రామానికి చెందిన సోలంకి సచిన్ తన తల్లి చంద్రకళను బైక్‌పై నేరడిగొండ నుంచి కిష్టాపూర్ గ్రామానికి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో టోల్‌ప్లాజా వద్ద వెనుక నుంచికారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో సచిన్‌తో పాటు ఆయన తల్లి చంద్రకళకు తీవ్ర గాయాలయ్యాయి. సచిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

హీరాసుక జయంతికి తరలిరావాలి

- ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నేతల పిలుపు



పూజలు చేస్తున్న ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నేతలు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 26న నిర్వహించే గోండి ధర్మగురు హీరాసుక జయంతికి ఆదివాసీ తొమ్మిది తెగలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో తరలిరావాలని జయంతి ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుర్వ నగేష్, పూసం ఆనంద్‌రావ్‌లు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆదివాసీ పురోహిత్ పర్ధాన్ సమాజ్ సంఘ భవన స్థలంలో హీరాసుక జెండా వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత దేశంలో వెలసిన సంస్కృతుల్లో అతి ప్రాచీన సంస్కృతి గోండి సంస్కృతి, గోండి ధర్మమన్నారు. 18 రకాల కృతులు, 16 రకాల వాయిద్యాల పద్ధతులతో సంగీత జ్ఞానం ఇచ్చిన్నటువంటి వారు హీరాసుక అని తెలిపారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఇంద్రవెల్లి మండల కేంద్రంలో నిర్వహించే వేడుకలకు రాష్ట్ర పంచాయతీ రాజ్, శిశు సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్దన్, కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఎస్పీలతో పాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆ సమాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, కొచడే నారాయణ, నాయకులు సెడ్మకి సుభాష్, కుర్సేంగే యాదవ్ రావ్, గేడం మాధవ్, సిడాం రాం కిషన్, సిడాం పురుషోత్తం, గోడం సునీల్ ఉన్నారు.

బాసరలో మాఘ పౌర్ణమి పూజలు



అమ్మవారి ఆలయంలో భక్తులు

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో శనివారం మాఘ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో వేద పండితులు చతుర్వేద సరస్వతీ మంత్ర సహిత చండీహోమం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు గణపతి పూజ, కళశస్థాపన, రక్షాబంధనం, మండపారాధనతో హోమ పూజలు నిర్వహిచారు. ఆలయ పూజారులు చండీహోమం చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న భక్తులు...

బాసర ఆలయానికి శనివారం భక్తుల తాకిడి పెరిగింది. ఉదయం నుంచే భక్తులు బారులుతీరి కనిపించారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం అక్కడి సూర్యేశ్వరస్వామిని దర్శించుకుని గంగమ్మ తల్లికి పూజలు చేశారు. బాసర ఆలయానికి చేరుకుని చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు చేయించారు. కుంకుమార్చనలు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుడిహత్నూర్: పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి శుక్రవారం రాత్రి రిమ్స్‌లో మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని మన్నూర్ గ్రామానికి చెందిన కదం నారాయణ (41) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో సొంత ఖర్చులకు ఇంట్లో చెప్పకుండా చాలా చోట్ల అప్పులు చేశాడు. ఈ క్రమంలో అప్పులు తీర్చే మార్గం లేక తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. గత ఆదివారం ఇంట్లోని పురుగుల మందుతాగి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. భార్య ఉర్మిల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.